క్లుప్తంగా

ఘనంగా సువర్చల హనుమత్ కల్యాణం


సువర్చల హనుమాన్ వివాహ మహోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సువర్చల హనుమాన్ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గురువారం ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సువర్చల హనుమాన్ కల్యాణం వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య కన్నుల పండుగగా భక్తజన రంజకంగా సాగింది. ఉదయం గణపతి పూజ, మన్యుసూక్త మహాభిషేకం, అర్చన , హోమాలు చేశారు. వివాహం అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. జిల్లా కేంద్రంలో శ్రీరామనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రవికుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో లబ్ధి

శాస్త్రవేత డాక్టర్ గిరిజ


రైతులకు అవగాహన కల్పిస్తున్న గిరిజ

కొమురవెల్లి(సిద్దిపేట): పంటలకు రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ గిరిజ పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని ఐనాపూర్‌లో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మతో కలసి రైతులకు వానాకాలం పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరిపంటలో అధిక దిగుబడినిచ్చే సన్న రకాలైన కే.ఎస్‌ఎం 1638, ఆర్ఎస్ఆర్ 15048, బీపీటీ5904, దొడ్డు రకాలు జేజీఎల్ 24423, ఆర్.ఎస్.ఆర్ 28361 రకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామానాయుడు, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, విస్తరణ అధికారులు రవళి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుస్నాబాద్: వ్యవసాయ పనిముట్లు రోటవేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేపంపులు, స్ప్రింకర్లు 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ డబ్బులు ఇంతవరకు రైతుల ఖాతాలో జమ చేయలేదన్నారు. ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు లేక రోడ్లపైనే ఆరబోసుకుంటున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో, మున్సిపాలిటీలో కల్లాల నిర్మాణాలకు రైతులకు నిధులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు వెల్పుల రాజు, రాంబాబు, వెంకటేశ్, శంకర్, సుధాకర్‌లు ఉన్నారు.

టపాసుల పరిశ్రమలో అగ్ని ప్రమాదం

రూ. 2 లక్షల లక్షల ఆస్తి నష్టం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాతూరు గ్రామంలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఓ టపాసుల పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. టాపాసులు ప్యాకింగ్ చేస్తుండగా బ్యాగులు ఒకదానిపై మరోకటి పడడంతో రాపిడి జరిగి అగ్ని ప్రమాదం జరిగిందని సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

డిగ్రీ కళాశాలకు పురస్కారం


ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు(అటానమస్) రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పురస్కారం లభించింది. పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రశంసా కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత, వైస్ ప్రిన్సిపాల్ డా. అయోధ్యరెడ్డిలకు అందజేశారు. కళాశాలలో ప్లాస్టిక్ నిషేధం, సౌరశక్తి వినియోగం, ఎల్ఈడీ, వర్షం నీరు సంసరక్షణ, డ్రిప్ సేద్యం, వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్, రీసైక్లింగ్ కార్యక్రమాలను కళాశాలలో నిబద్ధతతో నిర్వహిస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


దుబ్బాకలో మొక్కలు నాటి, నీళ్లు పోస్తున్న కమిషనర్ రమేష్‌కుమార్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వ్యాప్తంగా పర్యావరణ ప్రేమికులు, ప్రజలు ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భూ మండలాన్ని ప్లాస్టిక్ భూతం కమ్మేస్తోంది.. ప్లాస్టిక్‌ను నిరోధించడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవని మనుగడ సాధ్యమవుతోందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో స్వచ్ఛత, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.


దుబ్బాకలో మొక్కలు నాటి, నీళ్లు పోస్తున్న కమిషనర్ రమేష్‌కుమార్


కొమురవెల్లి(సిద్దిపేట): ప్లాస్టిక్ పై అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి కరుణాకర్


ములుగు(గజ్వేల్): కళాశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు


తొగుట(దుబ్బాక): పెద్ద మాసాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో..


దుబ్బాక: మొక్కలు నాటుతున్న కూకట్‌పల్లి ఎస్ఐ సత్యనారాయణ, రైస్ మిలర్స్ నాయకులు


కొండపాక(గజ్వేల్): తిమ్మారెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో..

పదవీ విరమణ వయస్సు పెంచొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): పదవీ విరమణ వయస్సు పెంచి నిరుద్యోగులకు అన్యాయం చేయొద్దని టీపీటీఎఫ్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పదవీ విరమణ వయస్సు పెంచే ఆలోచనను విరమించుకోవాలన్నారు. పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వాల్సి వస్తుందని విరమణ వయస్సును పెంచడం సరికాదన్నారు. 6న ప్రారంభయయ్యే బడిబాట పూర్తయిన తర్వాత సర్దుబాటు చేయాలని కోరారు.

అనుమతులు రద్దు చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పోతారం, గుగ్గిల్ల గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీల అనుమతులను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం బెజ్జంకిలో సీపీఎం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలు చోట్ల ఇథనాల్ ఫ్యాక్టరీల వల్ల పర్యావరణం దెబ్బతింటోందని ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో మండలంలో చేపట్టిన ఫ్యాక్టరీలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎల్లయ్య, సాయికృష్ణ, లింగం పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్


కగార్ ఆపరేషన్ ఆపాలంటూ ప్రజాసంఘాల ర్యాలీ

దుబ్బాక: పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశంపై దాడి చేసి అమాయకులను చంపితే కేవలం 3 రోజుల్లోనే శాంతి చర్చలంటూ దాడులు ఆపేశారు. అమాయకులైన గిరిజనులను నక్సలైట్ల పేరిట కాల్చి చంపడం దారుణమని ప్రజా సంఘాల ఉమ్మడి జిల్లా నాయకులు ఆరోపించారు. గురువారం బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలని, మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలని దుబ్బాకలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక జిల్లా అధ్యక్షుడు కీసరి ఎల్లం, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు, రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు బోనాల స్వామి, రమక్క మాట్లాడుతూ.. కర్రెగుట్టల్లో ఉన్న విలువైన ఖనిజ సంపదను అదాని, అంబానీలకు కట్టబెట్టేందుకే అడవుల్లో ఉన్న గిరిజనులకు అండగా ఉన్న నక్సలైట్లను కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట కాల్చిచంపుతుందని ఆరోపించారు. గిరిజనులను అడవులకు దూరం చేసి ఖనిజ సంపదను లూటీ చేయడం తప్పా కేంద్ర ప్రభుత్వానికి మరో ఉద్దేశం లేదన్నారు. ప్రశ్నించే వారిని నక్సలైట్లు అంటు కాల్చి చంపుతూ ఎన్‌కౌంటర్ కథ అల్లుతున్నారని విమర్శించారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను అరికట్టలేక దేశసంపదను కాపాడుతున్న అన్నలను చంపడం దారుణమన్నారు. వెంటనే మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరిపి నరమేధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, బాలేషం, మల్లేశం, నర్సింహులు, వెంకట్, స్వామి తదితరులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారానికి రండి


మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దుబ్బాక ఆత్మకమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావాలంటూ మంత్రి దామోదర రాజనర్సింహ్మా, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావుకు ఆహ్వాన పత్రిక చైర్మన్ గాందారి నరేందర్ రెడ్డి అందజేశారు. ప్రమాణ స్వీకారం ఈ నెల 8న నిర్వహించన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వెంగల్‌రావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పర్శరాములు


కొండపాక: మాట్లాడుతున్న పర్శరాములు

కొండపాక(గజ్వేల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పర్శరాములు పేర్కొన్నారు. మండలంలోని మర్పడ్గలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో మరిన్నీ భూ సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాదా బైనామాల పేరిట కొనుగోలు చేసిన భూములకు భూభారతి చట్టంలో పక్కాగా హక్కులు లభించేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాం, ఆర్ఐ బాలకిషన్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాసులాబాద్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండలంలోని కాసులాబాద్‌లో గురువారం అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో సుమారు 70 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ రాజ్‌కుమార్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ గెలల కొనుగోలుతో లబ్ధి


గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సాయిలు

మిరుదొడ్డి(దుబ్బాక): తాత్కాలికంగా ప్రారంభించిన ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఆయిల్‌పామ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్లాంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాములు కోరారు. గురువారం మండల పరిధిలోని పెద్ద చెప్యాలలో మాజీ ఎంపీపీ గజ్జెల సాయిలుతో కలిసి ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెప్యాలలో కొనుగోలు షెడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గెలల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టన్ను ఆయిల్‌పామ్ గెలలకు రూ.18,748లు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు రైతులు రవీందర్‌రెడ్డి, దిలీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం ర్యాంప్ నిర్మించండి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

హుస్నాబాద్: ఆర్డీఓ కార్యాలయం పైకి దివ్యాంగులు వెళ్లడానికి లిఫ్ట్ లేదా ర్యాంప్‌ను నిర్మించాలని గురువారం నియోజకవర్గ దివ్యాంగుల జేఏసీ కమిటీ సభ్యుడు రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆర్డీఓ కార్యాలయానికి సమస్యలు తెలియజేయడానికి వచ్చినప్పుడు భవనంపైకి ఎక్కలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్ట్ లేదా ర్యాంప్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సరిత, నాయకులు నవీన్‌రెడ్డి, శ్రీను, ప్రవీణ్, రాజు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి అండ


బియ్యం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: నిరుపేద కుటుంబానికి బీజేపీ నాయకులు అండగా నిలిచారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో చోటు చేసుకుంది. పల్లెపహాడ్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశం ఇటీవల మృతి చెందగా అతని కూతురు వివాహం ఈనెల 8న జరగనుంది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు నర్సింహ గురువారం క్వింటాల్ బియ్యం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బృందం

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో 'షీటీమ్' ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఏఎస్ఐ కిషన్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, సెల్‌ఫోన్ వాడకం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. మహిళలకు ఏరకమైన హాని జరిగిన మౌనం వీడి పోలీసులకు తెలియజేయాలన్నారు. పిల్లలను ఈతకు పంపొద్దన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మహిళలు వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో ఒంటిపై బంగారం వేసుకోవద్దని సూచించారు. ఒంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు కాల్ చేయాలని లేదా షీటీమ్ నంబర్ 8712667434కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ బృందం మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు


బడిబాటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంగీత

బెజ్జంకి(సిద్దిపేట): ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగీత పేర్కొన్నారు. బెజ్జంకిలో బడిబాటలో భాగంగా పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహజ వనరుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీలు, ఇత్తడి, రాగి పాత్రలు వినియోగించాలని సూచించారు. నార, సంచులు వాడాలన్నారు. అంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, నాయకులు, ఉపాధ్యాయులు మల్లేశం, బాలరాజు, బాబు, శ్రీనివాస్, సంజీవ్, సుగుణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంప్‌లు స్వాధీనం


ఇసుకడంప్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): అక్రమ ఇసుక డంప్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన కొండపాక మండలంలోని రవీంద్రనగర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన పోచయ్య గత కొంతకాలంగా వడ్డెర కాలనీలో ఇసుకను అక్రమంగా డంప్ చేస్తూ అధిక ధరకు విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు 65 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

సెయింట్ మేరీస్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు

గజ్వేల్‌రూరల్: దేశవ్యాప్తంగా జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైందని ఆ పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతి అయోగ్-ఏఐఎం ఆధ్వర్యంలో 2024-25లో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన మారథాన్‌లో లక్షకు పైగా పాఠశాలలు పాల్గొన్నాయి. ఇందులో నుంచి 1000 ప్రాజెక్టులను నీతి అయోగ్ ఎంపిక చేసిందన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్(సీబీఎస్ఈ) పాఠశాలకు చెందిన గైడ్ టీచర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో 6వ తరగతి విద్యార్థులు రూపొందించిన ఎల్ఈడీ విండ్‌మిల్ అనే ప్రాజెక్టు ఎంపికై నట్లు నీతిఅయోగ్ ప్రకటించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం డిజైన్ థింకింగ్ అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గైడ్ టీచర్ నాగలక్ష్మి, విద్యార్థులు కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపల్ విజయపాల్‌రెడ్డి, కాట రాయప్పలు అభినందించారు.

అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరి


బక్రిచెప్యాలలో మొక్కను నాటిన తహసీల్దార్

సిద్దిపేటఅర్బన్: వానాకాలం సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి మంచి దిగుబడి సాధించవచ్చని ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు సిద్దిపేట అర్బన్ మండలంలోని బక్రిచెప్యాల, పొన్నాల, కిష్టసాగర్ గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి పంటలలో అధిక దిగుబడినిచ్చే రకాలైన కేఎస్ఎం1638, ఆర్ఎస్ఆర్15048, జేజీఎల్ 24423, కేఎస్ఎం118, ఆర్ఎస్ఆర్28361 సాగు చేసుకోవాలని సూచించారు. వరి పంటని నష్టపరిచే కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు నివారణ, యాజమాన్య పద్ధతులపై అందుబాటులో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఎప్పటికప్పుడు సలహాలు తీసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం తయారీ విధానం గురించి అవగాహన కల్పించారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

వ్యవసాయ శాస్త్రవేత్త శ్వేత


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్వేత

కొండపాక(గజ్వేల్): పంట మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త శ్వేత పేర్కొన్నారు. మండలం పరిధి దుద్దెడలోని రైతు వేదికలో గురువారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వానాకాలంలో సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో వేసవి దుక్కులను చేయడంతో భూమిలో పంటలకు నష్ట చేసే క్రిమికీటకాలు చనిపోతాయన్నారు. ప్రతీ యేడు భూమిసారం పెరిగేందుకు పచ్చిరొట్ట, జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటివి విత్తుకోవాలన్నారు. పంటల్లో సాగు నీరు ఆదా అయ్యే పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలకు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడొద్దని సూచించారు. వరిపంటతో పాటు ఆరుతడి పంటలను, కూరగాయల, పండ్ల తోటలను, అయిల్ పామ్ తోటలను సాగు చేసుకుంటూ రైతులు ఆర్థికంగా లాభపడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పర్శరాములు, ఏఓ శివరామకృష్ణ, శాస్త్రవేత్త సతీష్, హార్టికల్చరర్ అధికారి కౌసల్య, డైరెక్టర్లు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.